సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 15 ఏప్రిల్ 2024



సోమశిలలో 8.62 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 8.62 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 620 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,420
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,647
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,846
సవర (8 గ్రాములు)	రూ.54,768



నిర్భయంగా ఓటేయండి

స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటేయాలని పోలీస్ అధికారులు కోరారు. కేంద్ర బలగాలతో కలిసి కవాతును నిర్వహించారు.

8లో

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హరినారాయణన్

నెల్లూరు(వేదాయపాళెం): అంబేడ్కర్ ఆశయ సాధనకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని వీఆర్సీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా నిలిచిపోయిన గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని కొనియాడారు. డీఆర్వో లవన్న, సాంఘిక సంక్షేమాధికారి రమేష్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మందా రాణి, బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన్, సమాచార ఉప సంచాలకుడు సదారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యంతోనే అగ్నిప్రమాదాల నివారణ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు

నెల్లూరు(క్రైమ్): ప్రజా చైతన్యంతోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. అజాగ్రత్తతోనే అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తాయని చెప్పారు. అనంతరం అగ్నిమాపక శాఖ సహాయాధికారి వేణుగోపాలరావు మాట్లాడారు. ప్రజలను చైతన్యం చేసేందుకు గానూ అవగాహన కార్యక్రమాలను ఈ నెల 20 వరకు నిర్వహించనున్నామని వివరించారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పోస్టర్లు, కరపత్రాలను కలెక్టరేట్లో డీఆర్వో లవన్న, తెలుగుగంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి ఆవిష్కరించారు.

విశేషాలంకారంలో అయ్యప్పస్వామి



అయ్యప్ప దర్శనానికి తరలివచ్చిన భక్తులు

నెల్లూరు(బృందావనం): మలయాళ నూతన సంవత్సరాది విషు పర్వదినాన్ని పురస్కరించుకొని వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారు విషుక్కణి అలంకారంలో ఆదివారం దర్శనమిచ్చారు. దేవస్థానాన్ని పండ్లు, కూరగాయలు, వివిధ ధాన్యాలతో అలంకరించారు. తొలుత గణపతి హోమం, నవకలశాభిషేకం, అర్చనలు, మహాహారతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు నాణేలను కానుకగా మేల్‌శాంతి అందజేశారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, జీవీకే రెడ్డి, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదం ఎంతో అవసరం



సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రస్తుత రోజుల్లో స్నేహభావం, లౌకికవాదం ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఆవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజ్ రంజాన్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు రఫీ, విశ్రాంత ప్రొఫెసర్ ఖాజారసూల్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, కమిటీ సభ్యుడు రియాజ్, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, రైతు సంఘ నేత వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెల్లుబికిన ప్రజాగ్రహం



నెల్లూరులోని జనార్దన్‌రెడ్డికాలనీలో వైఎస్సార్‌సీపీ నేతల నిరసన



కోవూరులో..



మర్రిపాడులో..

జననేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో టీడీపీ మూకలు చేసిన రాయి దాడిపై జిల్లా ప్రజానీకం భగ్గుమంది. సంక్షేమ పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో ఆయనకు లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఈ దుర్మార్గానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరసన కార్యక్రమాలను ఆదివారం చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్

హత్యా రాజకీయాలతో విజయం సాధించలేరు



ఎన్నికల ప్రచారంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

తోటపల్లిగూడూరు: హత్యా రాజకీయాలతో ప్రజాక్షేత్రంలో ఎవరూ విజయం సాధించలేరని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా బలంతో ఎన్నికలకు వెళ్తుంటే.. చంద్రబాబు ధనబలంతో ముందుకు సాగుతున్నారని ఆరోపించారు. ప్రజల మనస్సులో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సీఎంను రాజకీయంగా ఎదుర్కోలేక హత్యా రాజకీయాలకు చంద్రబాబు తెరలేపారని ధ్వజమెత్తారు. విజయవాడలో సీఎంపై జరిగిన దాడే దీనికి నిదర్శనమని తెలిపారు. ప్రజాశీస్సులు, దేవుడి దయతో జగన్‌మోహన్‌రెడ్డిని ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. రానున్న ఎన్నికల్లో గెలుపొందాలనే దురుద్దేశంతో ఆచరణ సాధ్యం కాని హామీలను చంద్రబాబు మరోసారి గుప్పిస్తున్నారని విమర్శించారు. అనైతిక పొత్తుతో ముందుకొస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, నేతలు టంగుటూరు పద్మనాభరెడ్డి, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, నెలవాయి ప్రకాష్‌రెడ్డి, టంగుటూరు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ కూటమి కుట్రే



ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వింజమూరు(ఉదయగిరి): సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి ముమ్మాటికీ టీడీపీ, జనసేన కుట్రేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. సీఎంపై దాడికి నిరసనగా నల్ల రిబ్బన్లను ధరించి వింజమూరులోని పార్టీ కార్యాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు ర్యాలీని ఆదివారం నిర్వహించారు. దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమనే సంకేతాలతో తట్టుకోలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన అనుచరులతో దాడి చేయించారని ఆరోపించారు. కనుబొమ్మపై రాయి తగలడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. 2019 ఎన్నికలకు కొద్ది నెలల ముందు ఇదే తరహాలో కోడికత్తితో దాడి చేయించిన అంశాన్ని గుర్తుచేశారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా తమ పార్టీ విజయం ఖాయమని చెప్పారు. ఉదయగిరి బస్టాండ్‌లో శాంతియుత ర్యాలీని నిర్వహించారు. జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ సుజన, స్థానిక నేతలు పల్లాల కొండారెడ్డి, జూపల్లి రాజారావు, విజయ్‌రెడ్డి, మద్దూరు బాబు, చిన్నికృష్ణారెడ్డి, తాటిచెట్ల నాగూర్, పల్లాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో గుణపాఠం చెప్పండి



మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందిస్తూ.. ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై విజయవాడలో రాళ్ల దాడి చేయడం హేయమైన చర్యగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అభివర్ణించారు. సీఎంపై జరిగిన దాడిని నిరసిస్తూ పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద నల్ల రిబ్బన్లను ధరించి పార్టీ నేతలతో కలిసి నిరసనను ఆదివారం ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారికి బుద్ధి చెప్పేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరారు. టీడీపీ అధికారం కోల్పోయిన నాటి నుంచి ఆ పార్టీ నేతలు ఏదో రకంగా రాష్ట్రంలో అరాచకాలు.. కుట్రలు.. కుతంత్రాలతో ప్రజలను రెచ్చగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అవాస్తవాలను వ్యాప్తి చేస్తూ సీఎంపై అనవసర రాద్ధాంతాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. అంగుళం తేడాలో కన్ను కోల్పోయే ప్రమాదం తప్పిందని చెప్పారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని చెప్పారు. జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, రూరల్ జేసీఎస్ కన్వీనర్ రాజేంద్రనాయుడు, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, జమీర్, కలామ్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

- నెల్లూరులో 150 ఎకరాల్లో నిర్మిస్తాం
- ఆర్నెల్లకోసారి జాబ్‌మేళాలు
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి



యల్లాయపాళెంలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, పక్కన ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు గానూ నెల్లూరులో 150 ఎకరాల్లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో భారీ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరోసారి పట్టంకట్టి.. ఎంపీగా తనను, కోవూరు ఎమ్మెల్యేగా ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఆర్నెల్లకోసారి జాబ్‌మేళాలను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్‌ను ఏర్పాటు చేసి ప్రజల నుంచి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని చెప్పారు.

సీఎంపై దాడి హేయం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్ల దాడి చేయడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. జగన్‌మోహన్‌రెడ్డి అంతు చూస్తానని, రాళ్లతో కొట్టిస్తానని చంద్రబాబు బహిరంగంగా చెప్పారని, దీని బట్టి చూస్తే దాడి ఎవరి ప్రోద్బలంతో జరిగిందో అర్థమవుతోందని చెప్పారు. సంక్షేమ పథకాలు పొందిన వారు సోమరులవుతారని టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యానించడం దారుణమన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను రద్దు చేస్తారనే అంశాన్ని పరోక్షంగా ఆమె చెప్పారని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న నేత ప్రసన్నకుమార్‌రెడ్డి అని.. కొత్తగా డబ్బు సంచులతో వచ్చిన నేత ప్రశాంతిరెడ్డి అని విమర్శించారు. జాతీయ స్థాయిలో సమస్యలుంటే తాను.. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో అయితే ప్రసన్న పరిష్కరిస్తారని చెప్పారు.

చంద్రబాబు తత్వాన్ని గ్రహించాలి

ప్రతిపక్షంలో ఉండి పోరాడిన వ్యక్తిని పక్కన బెట్టి, డబ్బున్న వారికి కోవూరు సీటును కేటాయించిన చంద్రబాబు కుతంత్రాన్ని ప్రజలు గ్రహించాలని పార్టీ కోవూరు నియోజకవర్గ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. తాను ఎమ్మెల్యేగా ఆరుసార్లు గెలిచినా ఏనాడూ గర్వపడలేదన్నారు. ఎవరైనా తన ఇంటికి నేరుగా రావొచ్చని.. ఎవర్నైనా తన పక్కన కూర్చోబెట్టుకొని మాట్లాడతానని తెలిపారు. ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందితే ఆమెను కలిసేందుకు మూడు గేట్లు దాటాల్సి ఉంటుందని, అప్పటికీ సెక్యూరిటీ లోపలికి అనుమతిస్తారనేది అనుమానమేనని పేర్కొన్నారు. ముస్లింకు నెల్లూరు సిటీ టికెట్‌ను ఇచ్చారనే కారణంతో పార్టీ మారిన వీపీఆర్ డబ్బుతో గెలవొచ్చని భ్రమపడ్డారని.. అయితే మంచి మనస్సున్న విజయసాయిరెడ్డిని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనకు నిద్రపట్టడంలేదని చెప్పారు. ప్రజాస్వామ్యంలో రాళ్లు వేయించడం నీచమైన చర్యగా అభివర్ణించారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీపీ జ్యోతి, విజయ డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి పెద్దపీట



షటిల్ ఆడుతున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు సిటీ: నగరంలోని పార్కుల్లో మౌలిక సదుపాయాలను కల్పించి.. వాటి అభివృద్ధికి పెద్దపీట వేస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో వాకర్స్ అసోసియేషన్లతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరును గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రానున్న ఐదేళ్లలో నెల్లూరు రూపురేఖలను మారుస్తామని వెల్లడించారు. తొలుత కొద్దిసేపు షటిల్ ఆడారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పార్టీ నెల్లూరు రూరల్, సిటీ అభ్యర్థులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్, మేయర్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

మైపాడులో సందడే.. సందడి



ప్రముఖ పర్యాటక కేంద్రం మైపాడు తీరంలో సందర్శకుల సందడి ఆదివారం నెలకొంది. ఎండలు మండుతుండటంతో వివిధ ప్రాంతాల నుంచి పలువురు భారీగా తరలివచ్చారు. సముద్రంలో స్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు. దీంతో బీచ్‌లో కోలాహలం నెలకొంది. – ఇందుకూరుపేట

ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): హరనాథపురంలో ఎస్వీ ది రాయల్ ఆర్ట్ గ్యాలరీ డ్రాయింగ్, పెయింటింగ్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు తోటపల్లి సురేష్‌బాబు ఆధ్వర్యంలో చిన్నారులు ఆదివారం ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. ప్రముఖ దంత వైద్య నిపుణుడు శ్రీనివాస్ నగరకంటి ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించి తిలకించారు. చిన్నారుల చిత్రకళా ప్రతిభను ప్రశంసించారు. ఆర్ట్ గ్యాలరీ రెండు రోజుల పాటు కొనసాగనుందని సురేష్‌బాబు తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే బాలబాలికల జిల్లా జట్లను నగరంలోని వీఆర్సీ మైదానంలో సోమవారం సాయంత్రం ఐదుకు ఎంపిక చేయనున్నామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వాసు తెలిపారు. క్రీడాకారులు 2006, జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని తెలిపారు. ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, వివరాలకు 94408 79884 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

చంద్రబాబు చరిత్రహీనుడు

- మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఆత్మకూరురూరల్: 'చంద్రబాబు నాయుడు చరిత్ర హీనుడు. ఆయన రాజకీయ జీవితం చూస్తే వెన్నుపోట్లు, హత్యలు, నమ్మకద్రోహాలే కనిపిస్తాయి' అని నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేయించిన రాళ్లదాడి టీడీపీ హత్యా రాజకీయాలకు పరాకాష్ట అన్నారు. బాబు దురాగతాలు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి టీడీపీని హస్తగతం చేసుకుని ఆ పార్టీని భ్రష్టుపట్టించారన్నారు. వంగవీటి రంగాను హత్య చేయించిన చంద్రబాబు చరిత్ర అందరికీ తెలిసిందేనన్నారు. ప్రజాభిమానం పొందలేక, జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక అంతమొందించేందుకు చేసిన కుట్రను అత్యంత హీనమైన చర్యగా ప్రజలు భావిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ భవిష్యత్ ఉండదనే భయంతో చంద్రబాబు ఎంతకైనా తెగిస్తాడనేందుకు ఇదొక నిదర్శనమన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

దుత్తలూరు: మండలంలోని నందిపాడులో తేనెటీగలు దాడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వర్లు, ఎన్.తరుణ్ తమ పొలానికి వెళ్లారు. ఈ సమయంలో తేనెటీగలు ఒక్కసారిగా వారిని చుట్టుముట్టి దాడి చేశాయి. ఇద్దరూ గాయపడగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఉదయగిరి వైద్యశాలకు తరలించారు.

బంగారు నగల కోసమే మహిళ హత్య

- తమ్ముడు, అతని స్నేహితులు అరెస్ట్
- రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

కొడవలూరు: బంగారు నగల కోసమే ఓ మహిళను తమ్ముడి వరుసయ్యే వ్యక్తి, మరో ఇద్దరు కలిసి హత్య చేసినట్లు నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి వెల్లడించారు. కొడవలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నార్తురాజుపాళెం దిన్నెకు చెందిన బయ్యా రాణిని (44) ఆమె తమ్ముడు వరుసయ్యే ఓట్టూరు అనూష్ అనే వ్యక్తి ఈనెల 9న నమ్మించి దగదర్తి మండలం ఊచగుంటపాళెంలో ఉన్న తన ఇంటికి తీసుకెళ్లాడు. అనూష్ తన స్నేహితులైన పాశం వెంకటేష్, దర్శిగుంట గిరీష్‌తో కలిసి రాణిని హత్య చేశాడు. ఆమె ఒంటిపై ఉన్న రూ.9,27,300 విలువైన 150 గ్రాముల బంగారు నగలు దోచుకొని మృతదేహాన్ని కావలి రూరల్ మండలం అన్నగారిపాళెం వద్దున్న చిప్పలేరు వద్దకు తీసుకెళ్లి కాల్చివేశారు. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి ఆదివారం కొడవలూరు మండలం పెయ్యలపాళెం వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 150 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు, కొడవలూరు ఎస్సై కె.వీరప్రతాప్, హెచ్‌సీ ఎం.గురుమూర్తి రాజు, పీసీలు కె.ఏడుకొండలు, టి.కృష్ణ, వి.అరుణ్‌కుమార్, పి.వెంకటేశ్వర్లును డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో కొడవలూరు సీఐ జి.సుబ్బారావు పాల్గొన్నారు.

బాబాసాహెబ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: యువత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దాచూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కలువాయి జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 144
లేయర్ (లైవ్)	: 98
బ్రాయిలర్ చికెన్	: 254
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 282
లేయర్ చికెన్	: 167



అంబేడ్కర్ ఆశయసాధనకు జగన్ కృషి

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన విజయసాయిరెడ్డి, మోపిదేవి, ఆదాల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీఆర్ అంబేడ్కర్ ఆశయసాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. నెల్లూరులో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. వీఆర్సీ వద్ద ఉన్న బాబాసాహెబ్ విగ్రహానికి ఆయన, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, నెల్లూరు రూరల్ అసెంబ్లీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్, జూపూడి ప్రభాకర్, ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా కొనసాగుతోందంటే దానికి అంబేడ్కర్ కారణమన్నారు. ఆయన రచించిన రాజ్యాంగం వల్ల సమసమాజం సాధ్యమైందన్నారు. సీఎం వైఎస్ జగన్ బాబాసాహెబ్ అడుగుజాడల్లో నడుస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచారన్నారు. సంక్షేమ పథకాలను అందించారన్నారు. జూపూడి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తిగా తీసుకుని పాలన చేస్తున్నారన్నారు.

చంద్రబాబుకు గుణపాఠం చెప్పడం ఖాయం



పార్టీలో చేరిన వారితో ఆదాల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో కోటారెడ్డి, నాయకులు

- వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోతుందని చంద్రబాబు నాయుడికి తెలుసు. అందుకే దాడులు చేయిస్తున్నారు. ఆయనకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయం' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లాడారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు వస్తున్న అపూర్వ స్పందనను చూసి ఇక తమకు భవిష్యత్ లేదని భావించిన ప్రతిపక్షాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. ఆగంతకులను పోలీసులు వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పార్టీలో 150 మంది చేరిక

రూరల్ నియోజకవర్గంలోని 19వ డివిజన్‌లో టీడీపీకి చెందిన 150 మంది యువకులు ఆదాల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. యువకులకు ఆదాల పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, రూరల్ పరిశీలకుడు మల్లు సుధాకర్‌రెడ్డి, నాయకులు ముడియాల రామిరెడ్డి, స్వర్ణా వెంకయ్య, మోహన్‌కృష్ణ, సతీష్, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటమి భయం పట్టుకుంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 'ఎన్నికల్లో ప్రజలు చిత్తుగా ఓడిస్తారని తెలుగుదేశం నాయకులకు భయం పట్టుకుంది. అందువల్లే దుర్మార్గాలకు ఒడిగడుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అంతమొందించడానికి చంద్రబాబు కుట్ర పన్నారు' అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తిలో ఆదివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. సీఎం చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు ప్రజల్లో అపూర్వ స్పందన వస్తోందని చెప్పారు. జగనన్న అధికారంలోకి రాకుండా ఎవరూ ఆపలేరన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఆయన గతంలో కంటే ఎక్కువ సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణను చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారన్నారు. బస్సు యాత్ర విజయవంతంగా జరుగుతున్న తరుణంలో బాబు జగనన్నపై దాడి చేయించారన్నారు. పిల్లనిచ్చిన మామపై చెప్పులు వేయించిన దుర్మార్గుడు చంద్రబాబని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభంజనం చూడలేక ఏదో ఒక విధంగా అంతమొందించాలనే టీడీపీ కుట్రలు చేస్తోందన్నారు. హత్యా రాజకీయాలకు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఆయన వెంట ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు ఉన్నారు.

ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



అమీర్‌జాన్ పెయింటింగ్

నెల్లూరు(బృందావనం): నెల్లూరుకు చెందిన చిత్రకారుడు షేక్ అమీర్‌జాన్ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. 2022లో పర్యావరణ పరిరక్షణ సందేశంతో 6.30 గంటల్లో పెయింటింగ్ వేశానన్నారు. దీంతో ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు కల్పించడంతోపాటు గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌ను ప్రకటించారన్నారు.

చుక్కలదుప్పిని కాపాడిన యువకులు

ఉదయగిరి: అటవీ ప్రాంతం నుంచి వచ్చిన చుక్కల దుప్పిని యువకులు కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని దిలావర్‌భాయి వీధిలో ఆదివారం చుక్కలదుప్పిని వీధికుక్కలు వెంబడించి దాడి చేసేందుకు ప్రయత్నించాయి. అక్కడున్న సమీద్‌తోపాటు మరికొంతమంది యువకులు కుక్కల బారినుంచి దుప్పిని రక్షించారు. అనంతరం అటవీ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లి అధికారులకు అప్పగించారు. వారు దానిని దుర్గంపల్లి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.75
సన్నవి	: రూ.60
పండ్లు	: రూ.26



వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే మరింత సంక్షేమం

- ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



జంగాలపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే మరింత సంక్షేమం ప్రజలకు అందుతుందని ఆ పార్టీ ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాచవారిపల్లి, జంగాలపల్లి, తురకపల్లి, బైరవరం గ్రామాల్లో ఆదివారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. ప్రజల్లో ఆయనకు వచ్చిన ఆదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. కూటమికి ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. ఈ ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగవుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు దేవుడు, ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు హామీలు నెరవేర్చకుండా మోసం చేశాడన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. మూడు పార్టీలు కలిసినా తమకు విజయావకాశాలు లేకపోవడంతోనే ప్రజల్లో గందరగోళం సృష్టించడానికే సీఎంపై దాడికి తెగబడ్డారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లెక్కల లక్ష్మీకాంతమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, సర్పంచ్‌లు నంబూరి వసంత, వెంకటరమణమ్మ, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు ఎల్‌పీ మాలకొండారెడ్డి, కొంకల వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీని నమ్మొద్దు

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: 'తెలుగుదేశం పార్టీని నమ్మొద్దు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. అందుకే అనేక మంది ఆకర్షితులైన వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 10, 16, 17, 18 వార్డుల్లో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా 17, 18 వార్డుల్లో సుమారు 170 మందికిపైగా టీడీపీకి చెందిన వారు బేకరీ మస్తాన్, వినోద్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కొందరు ప్రలోభాలకు గురై పార్టీని వీడుతున్నారని, వారికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ కనుమరుగవుతుందన్నారు. పార్లమెంట్ సభ్యుడిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. జగనన్న పాలన తిరిగి రాష్ట్రంలో అమలయ్యేలా లబ్ధిదారులు ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, డి.శ్రీనివాసులురెడ్డి, ముజీబ్, కలాం, ముతీవర్, జమీర్, పూనూరు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు ముమ్మరం.. నగదు, మద్యం స్వాధీనం



గాంధీబొమ్మ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు పోలీసు, సెబ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా శని, ఆదివారాల్లో వలేటివారిపాళెంలో బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.63,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తనిఖీ చేసి వింజమూరులో 20 మద్యం బాటిళ్లు, బాలాజీనగర్‌లో 10, నెల్లూరు రూరల్‌లో 12, కోవూరులో 16, కొండాపురంలో 13, రాపూరులో 20, కందుకూరులో 6, ఉలవపాడులో 12, సెబ్ అధికారులు 118 మొత్తంగా 227 మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులపై కేసులు నమోదు చేశారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు కవాతు నిర్వహిస్తున్నాయి. ఆదివారం కోవూరు, ఇందుకూరుపేట, కృష్ణపట్నం, కావలి రూరల్ పరిధిలో కవాతు జరిగింది. ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు సూచించారు.